సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
శుక్రవారం, 9, జూన్, 2023



ఆర్టీసీలో విలేజ్ బస్ ఆఫీసర్లు!
ప్రయాణికులకు మెరుగైన సేవలందించేందుకు ఆర్టీసీ డిపోల పరిధిలో కొత్తగా విలేజ్ బస్ ఆఫీసర్లను నియమించింది. 10లో



ఆగని అక్రమ రవాణా
భద్రాచలం మీదుగా పలు ప్రాంతాలకు గంజాయిని తరలిస్తున్నారు. చెక్‌పోస్ట్ వద్ద నిఘా పెట్టినా ఈ దందా ఆగడం లేదు. 8లో

వాతావరణం
గరిష్టం / కనిష్టం
44° / 29°
జిల్లాలో శుక్రవారం ఎండ తీవ్రత అత్యధికంగా ఉంటుంది. రాత్రి కూడా వడగాలులతో ఇబ్బందులు తప్పవు.

న్యూస్‌రీల్

కమనీయం.. రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక గురువారం కమనీయంగా జరిగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

పెద్దమ్మతల్లికి సువర్ణ పుష్పార్చన

పాల్వంచరూరల్ : మండల పరిధిలోని కేశవాపురం – జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువై ఉన్న శ్రీ పెద్దమ్మతల్లి అమ్మవారికి గురువారం వైభవంగా సువర్ణ పుష్పార్చన చేశారు. అర్చకులు 108 సువర్ణ పుష్పాలతో అర్చన నిర్వహించి హారతి, మంత్రపుష్పం, నివేదన సమర్పించారు. కార్యక్రమంలో వేద పండితులు, అర్చకులు పద్మనాభశర్మ, రవికుమార్ శర్మ, ఆలయ కమిటీ చైర్మన్ మహిపతి రామలింగం, ధర్మకర్తలు చింత నాగరాజు, గంధం వెంగళరావు పాల్గొన్నారు.

దశాబ్ది వేడుకల్లో భాగస్వాములు కావాలి



మాట్లాడుతున్న ఎస్పీ వినీత్

అశ్వాపురం: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎస్పీ వినీత్ అన్నారు. మండల పరిధిలోని కాకతీయుల కాలం నాటి తుమ్మలచెరువు వద్ద మొండికుంట, మల్లెలమడుగు, రామచంద్రాపురం, నెల్లిపాక, సీతరాంపురం, ఆనందాపురం గ్రామాల రైతులు, మహిళలతో గురువారం పెద్ద ఎత్తున జరిగిన చెరువుల పండుగలో ఆయన పాల్గొన్నారు. మహిళలు బతుకమ్మలు, బోనాలతో రాగా ఎస్పీ వారితో కలిసి బతుకమ్మ ఆడారు. అనంతరం మాట్లాడుతూ.. ఊరూరా చెరువుల పండుగతో ప్రజలు, రైతులు, మహిళలంతా ఒకచోట చేరడంతో గ్రామాల్లో సందడి నెలకొందన్నారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సూదిరెడ్డి సులక్షణ, ఎంపీడీఓ వరప్రసాద్ పాల్గొన్నారు.

పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కొత్తగూడెంఅర్బన్: జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఖాళీగా ఉన్న వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ జేవీఎల్ శిరీష గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్‌హెచ్‌ఎంలో ఖాళీగా పిల్లల వైద్యులు – 03, మత్తు వైద్యులు – 02, గైనకాలజిస్ట్‌- 02, ఫిజియాలజిస్ట్‌- 01, డెంటల్ టెక్నీషియన్ -01.. మొత్తం 9 పోస్టులకు అర్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో వారి ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఈనెల 9 నుంచి 12వ తేదీ లోగా ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కోరారు.

సర్కారుకే మొగ్గు!

ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో పెరుగుతున్న అడ్మిషన్లు
- రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధిస్తున్న విద్యార్థులు
- ప్రభుత్వ విద్యాసంస్థల్లో మెరుగవుతున్న వసతులు
- ఇంకొన్ని సమస్యలు పరిష్కరిస్తే మరింత ఆదరణ



భద్రాచలం: ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో బోధన, బోధనేతర సౌకర్యాలు గతంలో కంటే మెరుగయ్యాయి. వీటిని సద్వినియోగం చేసుకున్న పాఠశాలలు అద్భుత ఫలితాలు సాధిస్తుండగా, అలసత్వం వహిస్తున్న స్కూళ్లు వెనుకబడుతున్నాయి. పాఠశాలల ప్రారంభం నాటికే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అందజేస్తున్నారు. ప్రణాళిక మేరకు విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్నారు. జనవరి తర్వాత పది, ఇంటర్ విద్యార్థులకు అదనపు తరగతుల నిర్వహణతో పాటు పాఠశాలలు, కళాశాలల్లో దాతల సహకారంతో స్నాక్స్, అల్పాహారం అందిస్తున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభం కాగానే బడిబాట నిర్వహించి డ్రాపవుట్స్‌ను గుర్తించి పాఠశాలకు వచ్చేలా చూస్తున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో బయోమెట్రిక్ విధానం అమలు చేస్తూ ప్రతి విద్యార్థి కళాశాలకు వచ్చేలా చర్యలు తీసుకుంటున్నారు. వీటి అమలులో కొన్ని వైఫల్యాలు ఉన్నప్పటికీ సౌకర్యాలను సద్వినియోగం చేసుకున్న పాఠశాలల్లో ఫలితాలు పెరుగుతున్నాయి. వీటికి తోడు నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులు, అధ్యాపకులు బాధ్యతగా స్వీకరించిన పాఠశాలలు, కళాశాలల్లో అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్నారు. లేని చోట్ల వెనుకబడుతున్నారు. ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో జిల్లాలో 78.53 శాతం నమోదు కాగా, ఇంటర్ ఫలితాలలో ప్రథమ సంవత్సరంలో 60, ద్వితీయ సంవత్సరంలో 76 శాతం నమోదయింది.

విద్యారంగ నిపుణుల సూచనలిలా..
- ప్రాథమిక విద్యను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేయాలి. దీంతో ప్రాథమికోన్నత, ఉన్నత, ఇంటర్ విద్యల్లో మెరుగైన ఫలితాలు లభిస్తాయి
- విద్యార్థులు అధికంగా ఉన్న పాఠశాలల్లో తరగతికి ఒక్క ఉపాధ్యాయుడైనా ఉండాలి
- పాఠశాలలు, కళాశాలల్లో ఖాళీగా ఉన్న సబ్జెక్టు పోస్టులను భర్తీ చేయాలి
- ప్రధానంగా బోధనేతర సిబ్బందిని నియమించాలి. తద్వారా ఉపాధ్యాయులకు బోధనేతర బాధ్యతలు తప్పుతాయి. విద్యార్థులపై పూర్తి స్థాయిలో శ్రద్ధ పెట్టే అవకాశం ఉంటుంది
- ఉపాధ్యాయులు, అధ్యాపకులను పర్యవేక్షణ చేసే సూపర్ న్యూమరీ పోస్టులను భర్తీ చేయాలి
- క్రీడా మైదానాలను ఏర్పాటు చేయాలి
- అన్ని పాఠశాలలు, కళాశాలల్లో భౌతిక వసతులు, వనరులను సమకూర్చాలి



ఇది భద్రాచలంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల. ప్రతి ఏడాది బాసరలోని ఐఐటీ కళాశాలకు కనీసం ఒక్క విద్యార్థిని అయినా ఉండటం ఈ పాఠశాల ప్రత్యేకత. ఈ స్కూల్ విద్యార్థినులు ఇప్పటివరకు పదుల సంఖ్యలో బాసర ఐఐటీ, పాలిటెక్నిక్ కళాశాలలో సీట్లు సాధించారు. ప్రతి ఏడాది పదో తరగతిలో 9.8 జీపీఏకు తగ్గకుండా మార్కులు సాధించడం మరో విశేషం. ఈ పాఠశాలలో పేద, మధ్యతరగతి విద్యార్థినులతో పాటు ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు, వ్యాపారుల పిల్లలు సైతం చదువుతుంటారు. ఈ పాఠశాలలో సీటు కావాలంటే ముందస్తుగా సంప్రదించాల్సిందే.



కలెక్టర్‌చే అభినందనలు, సత్కారం అందుకుంటున్న ఈ విద్యార్థి పేరు కొండ సాయి తేజ. దుమ్ముగూడెం మండలం చిన్న ఆర్లగూడెం గ్రామానికి చెందిన ఈ విద్యార్థి 2022లో ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీ విభాగంలో 470 మార్కులకు 467 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం సాధించాడు. ఈ ఏడాది ద్వితీయ సంవత్సరంలో 1000 మార్కులకు గాను 990 మార్కులతో రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంకు పొందాడు. అయితే ఈ విద్యార్థి అసాధారణ ఫలితాలను సాధించింది ఓ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కావడం విశేషం. ఏజెన్సీలోని దుమ్ముగూడెంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివి రాష్ట్ర స్థాయిలో ర్యాంకుతో జిల్లా విద్యార్థులకు ఆదర్శంగా నిలిచాడు.

అందరికీ అందుబాటులో..



ప్రస్తుతం ప్రభుత్వ విద్య అందరికీ అందుబాటులో ఉంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన పాఠశాలలను ఆదర్శంగా తీసుకుని ఇతర పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పనిచేయాలి.
– సోమశేఖర శర్మ, డీఈఓ

అన్ని వసతులు సమకూర్చాలి



ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే తగిన వసతులు కల్పించాలి. బోధన, బోధనేతర సిబ్బంది భర్తీతో పాటుగా ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లు పూర్తి చేయాలి. ఇవి సకాలంలో పూర్తయితే విద్యా సంవత్సరానికి ఎటువంటి ఆటంకాలు ఉండవు.
– బి రాజు, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

ర్యాంక్ పొందడం హర్షణీయం



అందరి సమష్టి కృషితో మా కళాశాల ఈ విజయాన్ని సాధించింది. విద్యార్థి జ్ఞానం, అధ్యాపకుల కృషితో రాష్ట్రస్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానంలో మా విద్యార్థి నిలిచాడు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో తెలివితేటలు ఉన్న విద్యార్థులకు కొదవలేదు. వారిని ప్రోత్సహిస్తే ఉత్తమ ఫలితాలకు ఢోకా ఉండదు. – వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్, దుమ్ముగూడెం ప్రభుత్వ కళాశాల

చెరువులో దిగి.. చేపలు పట్టి

మృగశిర సందడిలో ప్రభుత్వ విప్ రేగా..



కుర్నవల్లిలో చేపలు పడుతున్న విప్ కాంతారావు

కరకగూడెం : మృగశిర కార్తె ప్రారంభం సందర్భంగా గురువారం ఏ గ్రామంలో చూసినా చేపలు పట్టడం, కొనుగోలు చేయడం వంటి సందడి కనిపించింది. ఇక ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు.. కరకగూడెం మండలంలోని తన స్వగ్రామమైన కుర్నవల్లిలో స్థానికులు, చిన్నారులతో కలిసి చెరువులోకి దిగి చేపలు పట్టారు. సరదాగా కాసేపు ఈత కొట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ మత్స్యరంగానికి అధిక ప్రాధాన్యత ఇచ్చి మత్స్య సంపద సృష్టించారని అన్నారు.

ఆకాశం.. అరుణ వర్ణ శోభితం !



సాయం సంధ్య వేళ చెరువు వద్ద ఆకాశం నీలిరంగును పులుముకోగా మబ్బులమాటున దాగిన సూర్యుడు కనువిందు చేశాడు. సూర్యకాంతితో చెరువు నీళ్లు ఎర్రగా మారాయి. గురువారం సాయంత్రం సింగభూపాలెం చెరువు వద్ద నెలకొన్న ఈ సుందర దృశ్యం కనువిందు చేసింది. –సుజాతనగర్

మత్స్య సంపద పెంపునకు కృషి



చేపల వంటకాలను కొనుగోలు చేస్తున్న కలెక్టర్ అనుదీప్



ఫిష్ బిర్యానీ ఆరగిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే వనమా తదితరులు

- చేప పిల్లల పంపిణీతో వేలాది మందికి ఉపాధి
- కలెక్టర్ అనుదీప్, ఎమ్మెల్యే వనమా
- 'గూడెం'లో ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ ప్రారంభం

సూపర్‌బజార్(కొత్తగూడెం): మత్స్య సంపద పెంపునకు రాష్ట్ర ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోందని కలెక్టర్ అనుదీప్, కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. చేప పిల్లలను ఉచితంగా పంపిణీ చేయడంతో వేలాది మంది మత్స్యకారుల కుటుంబాలకు జీవనోపాధి కలుగుతోందని చెప్పారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియంలో ఏర్పాటు చేసిన ఫిష్ ఫుడ్ ఫెస్టివల్‌ను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చేప పిల్లల పంపిణీలో రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. మిషన్ కాకతీయ పథకం ద్వారా చెరువుల పూడికతీతతో నీటి సామర్థ్యం పెరిగిందని, దీంతో చేపల పెంపకానికి అనువుగా ఉందని తెలిపారు. నిరాదరణకు గురైన మత్స్యసంపద అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన చర్యల ఫలితంగా మత్స్యకారుల కుటుంబాలలో వెలుగులు నిండాయని అన్నారు. ప్రస్తుతం తెలంగాణ ఇతర రాష్ట్రాలకు చేపలు ఎగుమతి చేసే స్థాయికి ఎదిగిందని చెప్పారు. మత్స్య సంపద పెంపునకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పథకాలు సత్ఫలితాలు ఇస్తున్నాయని అన్నారు. జిల్లాలోని వివిధ సంఘాల నుంచి చెరువుల ద్వారా వివిధ రకాల చేపలతో ఎంతో రుచికరమైన ఆహార పదార్థాలను తయారు చేశారని అభినందించారు. చేపలతో ఇన్ని రకాల వంటకాలు తయారు చేయొచ్చని ఇప్పుడే చూస్తున్నానని కలెక్టర్ అన్నారు. ప్రజలు ఫుడ్ ఫెస్టివల్‌ను సందర్శించి చేపల వంటకాలను రుచిచూడాలని కోరారు. చేపలతో ప్రొటీన్లు వస్తాయని, కోవిడ్ తర్వాత చేపల వినియోగం గణనీయంగా పెరిగిందని తెలిపారు. ఫుడ్ ఫెస్టివల్‌లో ఉత్తమ వంటకాలను ఎంపిక చేసి, ప్రభుత్వం తరపున ఆర్థిక సాయం, ప్రశంస పత్రాలు అందజేస్తామని వివరించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగాల రాజేందర్, చుంచుపల్లి ఎంపీపీ బాదావత్ శాంతి, జిల్లా మత్స్యశాఖాధికారి వీరన్న, తహసీల్దార్ కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఫుడ్ ఫెస్టివల్ సందర్భంగా కలెక్టర్ అనుదీప్, ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావును మత్స్యశాఖ జిల్లా అధికారి వీరన్న అభినందించారు.

నేడు 'సంక్షేమ' సంబురాలు

విజయవంతం చేయాలని కలెక్టర్ పిలుపు

సూపర్‌బజార్(కొత్తగూడెం): తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం జరిగే సంక్షేమ సంబురాలను విజయవంతం చేయాలని కలెక్టర్ అనుదీప్ పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. కొత్తగూడెం నియోజకవర్గంలో చుంచుపల్లి మండలంలోని కల్యాణ మండపంలో, ఇల్లెందు మార్కెట్ యార్డులో, భద్రాచలం మార్కెట్ యార్డులో, పినపాక నియోజకవర్గానికి సంబంధించి మణుగూరులోని హనుమాన్ ఫంక్షన్ హాలులో, అశ్వారావుపేట నియోజకవర్గానికి సంబంధించి దమ్మపేట మార్కెట్ యార్డులో ఈ వేడుకలు నిర్వహించనున్నట్లు వివరించారు. పినపాకకు మైనార్టీ సంక్షేమాధికారి సంజీవరావు, కొత్తగూడేనికి జిల్లా పశుసంవర్థక శాఖాధికారి డాక్టర్ పురంధర్, అశ్వారావుపేటకు ఎస్సీ అభివృద్ధి అధికారి డి.అనసూర్య, ఇల్లెందుకు జిల్లా సంక్షేమాధికారి ఎం. సబిత, భద్రాచలానికి జిల్లా వెనుకబడిన తరగతుల అధికారి ఇ. ఇందిర ప్రత్యేకాధికారులుగా వ్యవహరిస్తారని తెలిపారు.

ఉత్తమ సేవలందిస్తున్నారు..



సర్టిఫికెట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్, వైద్యాధికారులు

కొత్తగూడెంఅర్బన్ : జిల్లా ఆస్పత్రికి అనుబంధంగా ఉన్న తెలంగాణ డయాగ్నస్టిక్స్ టీ హబ్ లేబొరేటరీ ద్వారా ప్రజలకు అత్యున్నతమైన సేవలు అందిస్తున్నారని కలెక్టర్ అభినందించారు. ఈ మేరకు జాతీయ కేంద్ర లేబొరేటరీ నాణ్యతా ప్రమాణాల సంస్థ జారీ చేసిన సర్టిఫికెట్‌ను గురువారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జాతీయ లేబొరేటరీ నాణ్యతా ప్రమాణాల కేంద్రం నుంచి సర్టిఫికెట్ రావడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ శిరీష, కొత్తగూడెం మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌రావు, జిల్లా కేంద్ర ఆస్పత్రి సూపరింటెండెంట్ కుమారస్వామి, వైద్యులు రత్నకుమారి, దివ్య తదితరులు పాల్గొన్నారు.

చెరువు.. తల్లితో సమానం



గొల్లపల్లిలో బతుకమ్మ ఎత్తుకున్న కలెక్టర్ అనుదీప్

టేకులపల్లి: చెరువు తల్లితో సమానమని, చెరువు నీరు లేకపోతే మనం లేమని కలెక్టర్ అనుదీప్ అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండలంలోని గొల్లపల్లి సాయమ్మ చెరువు ఆవరణలో గురువారం జరిగిన వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. బోనాలు, బతుకమ్మలతో మహిళలు కలెక్టర్‌కు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం చెరువు వద్ద మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2014కు ముందు రాష్ట్రం కరువుతో అల్లాడిందని, రాష్ట్ర ఆవిర్భావం తర్వాత సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంతో చెరువులు అభివృద్ధి చెందాయని తెలిపారు. భూగర్భ జలాల పెంపుతో సాగునీటి ఇబ్బందులు తప్పాయని అన్నారు. చెరువుల ప్రాముఖ్యత, నీటి వనరుల సంరక్షణ గురించి భావి తరాలకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం ప్రజలతో కలిసి కలెక్టర్ భోజనం చేశారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఎస్‌ఈ శ్రీనివాసరెడ్డి, ప్రజాప్రతినిధులు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు. కాగా, కలెక్టర్ అనుదీప్ తన చిన్నారి కూతురుతో కార్యక్రమానికి హాజరు కావడం విశేషం.

'ముస్కాన్'తో మురిసె..

- భద్రాచలం ఏరియా ఆస్పత్రికి అవార్డు
- చిన్నారుల మెరుగైన సేవలకు గుర్తింపు
- మూడేళ్లలో అందనున్న రూ.24 లక్షల ప్రోత్సాహం



డెడికేటెడ్ పీడియాట్రిక్ కేర్ విభాగంలో చికిత్స పొందుతున్న చిన్నారులు (ఫైల్)

భద్రాచలంఅర్బన్: చిన్నారులకు మెరుగైన వైద్య సేవలు అందించినందుకు గాను భద్రాచలం ఏరియా ఆస్పత్రి ఉత్తమ పురస్కారానికి ఎంపికైంది. పిల్లల ఓపీడీ, చిన్నారుల వార్డు, ఎస్ఎన్‌సీయూ(స్పెషల్ న్యూబార్న్ కేర్ యూనిట్), ఎన్ఆర్‌సీ (పోషకాహార కేంద్రం)లు క్వాలిటీ సర్టిఫికేషన్ ముస్కాన్ ప్రోగ్రాం(ఎన్‌క్వాస్) అవార్డు దక్కించుకుంది. ఎన్‌క్వాస్ బృందం ఏప్రిల్ 21, 22 తేదీల్లో ఆస్పత్రిలోని పిల్లల ఇన్, ఔట్ పేషెంట్ వార్డులతో పాటు ఎస్ఎన్‌సీయూ, ఎన్ఆర్‌సీ కేంద్రాలను తనిఖీ చేసింది. ఈ బృందం జాతీయ కుటుంబ, ఆరోగ్య సంక్షేమ శాఖకు అందించిన నివేదిక మేరకు.. ఆస్పత్రిలోని పిల్లల విభాగాలు జాతీయ స్థాయిలో ఎన్‌క్వాస్ గుర్తింపు పొందినట్లు మే 26న రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ అందింది. ఈ విషయాన్ని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు ఇటీవలే భద్రాచలం ఏరియా ఆస్పత్రి అధికారులకు ఈ మెయిల్ ద్వారా సమాచారం అందించారు. పిల్లల విభాగాల్లో పారిశుద్ధ్యం, పడకల సౌకర్యం, ఐసీయూ, చిన్నారులకు అందిస్తున్న యాంటీబయోటిక్స్ పరిమాణం తదితర అంశాలను పరిశీలించిన బృందం సభ్యులు నివేదిక రూపొందించారు. రాష్ట్రంలోని మరికొన్ని ఆస్పత్రులను సైతం వారు తనిఖీ చేశారు. భద్రాచలం ఆస్పత్రిలో మెరుగైన సేవలు అందుతున్నాయని గుర్తించిన సభ్యులు.. ఎట్టకేలకు ముస్కాన్ అవార్డుకు ఎంపిక చేశారు.

బాధ్యత పెరిగింది



పిల్లల వార్డుకు జాతీయ స్థాయిలో గుర్తింపు రావడంతో మా బాధ్యత మరింత పెరిగింది. పిల్లలకు అదనపు సౌకర్యాలు కల్పిస్తూ మెరుగైన సేవలందించేలా కృషి చేస్తాం. పిల్లల విభాగంలో మా వైద్యుల బృందం, ఎన్‌క్వాస్ జిల్లా నాణ్యత మేనేజర్ శృతి కృషితోనే ఈ గుర్తింపు లభించింది.
– రాజశేఖర్ రెడ్డి, పీడియాట్రిక్ విభాగం నోడల్ అధికారి

ఒక్కో విభాగానికి రూ.2 లక్షలు..

భద్రాచలం ఏరియా ఆస్పత్రిలోని పిల్లల విభాగాలు జాతీయ స్థాయి పురస్కారానికి ఎంపిక కాగా, ఒక్కో విభాగానికి రూ.2 లక్షల చొప్పున ప్రోత్సాహకం అందనుంది. పిల్లల ఓపీడీ, ఇన్ పేషెంట్, ఎన్ఆర్‌సీ, ఎస్ఎన్‌సీయూ విభాగాలకు ఏడాదికి రూ.2 లక్షల చొప్పున మొత్తం రూ.8 లక్షలు రానున్నాయి. ఇలా మూడేళ్ల పాటు రూ.24 లక్షలు అందజేస్తారు. అనంతరం మళ్లీ పరిశీలన చేస్తారు. అదే జిల్లా ఆస్పత్రి ఈ అవార్డుకు ఎంపికైతే ఒక్కో విభాగానికి రూ.3 లక్షల చొప్పున ఏడాదికి రూ.12 లక్షలు, మూడేళ్లకు రూ.36 లక్షలు అందేవి. భద్రాచలం ఆస్పత్రికి ప్రస్తుతం వచ్చే నిధుల్లో 25 శాతం సిబ్బందికి ప్రోత్సాహకంగా, 75 శాతం ఆయా విభాగాల్లో మెరుగైన సేవల కోసం వసతుల కల్పనకు ఖర్చు చేయాల్సి ఉంటుంది.

క్లుప్తంగా

వైభవంగా సుదర్శన హోమం



హోమం జరిపిస్తున్న అర్చకులు

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలో కొలువుదీరిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో గురువారం వైభవంగా సుదర్శన హోమం జరిపించారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి సుప్రభాత సేవ, అర్చనలు, గోత్రనామార్చనలు తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అర్చకుడు ప్రసాదాచార్యులు ఆధ్వర్యంలో సుదర్శన హోమం చేశారు. కార్యక్రమంలో ఆలయ మేనేజర్ రమణ, తహసీల్దార్ భద్రకాళి దంపతులు, వేముల నగేష్ దంపతులు, చిలుకూరి ఉపేంద్రరెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుండి బాస్కెట్‌బాల్ టోర్నీ

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం సీఈఆర్ క్లబ్‌లో ఈనెల 10నుంచి ఉమ్మడి జిల్లా స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఆర్.రమేష్ తెలిపారు. సరళ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో పురుషులు, స్త్రీల జట్లకు వేర్వేరుగా నిర్వహించే ఈ పోటీలను ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోండి



పాఠకులతో మాట్లాడుతున్న దిండిగాల రాజేందర్

పాల్వంచ: వివిధ పోటీ పరీక్షలు రాసే అభ్యర్థులకు గ్రంథాలయాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని, యువత సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగాల రాజేందర్ అన్నారు. స్థానిక గ్రంథాలయాన్ని గురువారం ఆయన తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులతో మాట్లాడి సౌకర్యాలు ఎలా ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు ఇంగ్లిష్ మీడియం పుస్తకాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఆయన వెంట లైబ్రేరియన్ కె.మధుబాబు, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు మంతపురి రాజుగౌడ్ ఉన్నారు.

లారీ ఢీకొని మహిళ మృతి

దైవదర్శనానికి వెళ్లొస్తుండగా ప్రమాదం

బూర్గంపాడు: మండలంలోని ముసలిమడుగు వద్ద జాతీయ రహదారిపై గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏటపాక మండలం నందిగామ గ్రామానికి చెందిన లక్ష్మి(45), ఆమె కుమారుడు నరేంద్రబాబు పెద్దమ్మతల్లి గుడికి వెళ్లి మోటార్‌సైకిల్‌పై తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో ముసలిమడుగు వద్ద జాతీయ రహదారిపై వీరి మోటార్‌సైకిల్‌ను ఎదురుగా వస్తున్న లారీ వేగంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో లక్ష్మి అక్కడికక్కడే మృతి చెందింది. అలాగే, నరేంద్రబాబుకు తీవ్రగాయాలు కావడంతో భద్రాచలం ఆస్పత్రికి తరలించారు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వడదెబ్బతో వ్యక్తి...

కారేపల్లి: వడదెబ్బ కారణంగా ఓ వ్యక్తి మృతి చెందాడు. ఇల్లందు పట్టణం ఇందిరానగర్ కాలనీకి చెందిన జనప వెంకటరమణ(34)కు భార్యతో విభేదాలు రావటంతో ఒంటరిగా నివసిస్తున్నాడు. మూడు రోజుల క్రితం ఖమ్మంలోని తన సోదరి ఇంటికి వెళ్లి చెప్పకుండా వచ్చేశాడు. అప్పటి నుంచి కారేపల్లి మండలం నడిమూరులో తిరుగుతున్న ఆయన ఎవరైనా భోజనం పెడితే తింటున్నాడు. ఈక్రమంలో పొలాల్లోకి వెళ్లిన వెంకటరమణ వడదెబ్బ తగిలి అక్కడే మృతి చెందగా స్థానికులు సమాచారం ఇచ్చారని ఎస్‌ఐ పుష్పాల రామారావు తెలిపారు.

చికిత్స పొందుతున్న మహిళ..

గుండాల: రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళ గురువారం మృతి చెందింది. వివరాలు... టేకులపల్లి మండలం శంభునిగూడెంకు చెందిన సనప జయలక్ష్మి(50) ఆరు నెలల క్రితం గుండాలకు వచ్చి పండ్లు అమ్ముకుంటూ జీవనం సాగిస్తోంది. గుండాలలో మంగళవారం వారాంతపు సంత కావడంతో ఆటోలో కొత్తగూడెం వెళ్లి పండ్లు తీసుకుని వస్తుండగా ఆటోడ్రైవర్ నిద్రమత్తులో నడపడంతో వాహనం బోల్తా పడింది. అయితే, అప్రమత్తమైన ఆటోడ్రైవర్ కిందకు దూకి తప్పించుకోగా ఆటోలో ఉన్న ఈసం భిక్షం, సనప జయలక్ష్మికి తీవ్ర గాయాలయ్యాయి. వీరికి ఇల్లెందు ఏరియా ఆస్పత్రిలో చికిత్స అనంతరం కొత్తగూడెం తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఆమె గురువారం మృతి చెందింది.

పామాయిల్ గెలలు



టన్ను ధర రూ.13,346

ఆగని అక్రమ రవాణా..

- చెక్‌పోస్ట్ వద్ద కొరవడుతున్న నిఘా
- యథేచ్ఛగా గంజాయి తరలిస్తున్న స్మగ్లర్లు
- పట్టుబడుతున్నది సగాని కంటే తక్కువే
- అక్రమార్కులకు కొందరు ప్రభుత్వ సిబ్బంది మద్దతు ?



ట్రాక్టర్‌లో అక్రమంగా తరలిస్తున్న గంజాయిని పట్టుకున్న పోలీసులు (ఫైల్)

భద్రాచలంఅర్బన్: భద్రాచలం బ్రిడ్జి సెంటర్‌లోని ఫారెస్టు చెక్‌పోస్టు వద్ద పోలీసులు, అటవీ అధికారులు నిత్యం తనిఖీలు నిర్వహిస్తున్నా గంజాయి అక్రమ రవాణా మాత్రం ఆగడం లేదు. చెక్ పోస్టులు, పోలీస్ స్టేషన్లు దాటుకుంటూ యథేచ్ఛగా తరలిస్తున్నారు. దీనికి అడ్డుకట్ట వేసేందుకు పోలీసులు కొంతమేర చర్యలు చేపడుతున్నా.. అక్రమార్కులు ఎత్తుకు పైఎత్తు వేస్తూ తమ పని కానిచ్చేస్తున్నారు. రకరకాల మార్గాల్లో గంజాయి తరలిస్తూనే ఉన్నారు. ట్రాక్టర్‌కు ప్రత్యేక బాక్స్‌లు అమర్చి అందులో తరలిస్తున్న 4.85 క్వింటాళ్ల గంజాయిని పోలీసులు ఇటీవల పట్టుకోగా, మరో ఘటనలో కారులో దుస్తులు అమ్ముతున్నట్లు నమ్మించేందుకు పైన చీరలు అమర్చి, వాటి కింద 4.50 క్వింటాళ్ల గంజాయి తరలిస్తుండగా పోలీసులు పట్టుకోవడంతో నిందితులు వాహనం వదిలేసి పారిపోయారు. ఇలా నిత్యం భద్రాచలం మీదుగా గంజాయిని తరలిస్తూ కొందరు పట్టుబడుతున్నప్పటికీ.. అంతకు రెండు రెట్లు చెక్‌పోస్టు దాటి పోతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇక్కడి చెక్‌పోస్టు దాటిపోయాక అందే విశ్వసనీయ సమాచారంతో జిల్లాలోని ఇతర పోలీస్‌స్టేషన్ల పరిధిలో గంజాయిని స్వాధీనం చేసుకున్న ఘటనలు కోకొల్లలు. అంటే భద్రాచలం చెక్‌పోస్ట్ వద్ద పటిష్ట నిఘా కొరవడిందని పలువురు అంటున్నారు.

సిబ్బంది పాత్రపై అనుమానాలు..

భద్రాచలం మీదగా తరలిస్తున్న గంజాయిని పోలీసులు పట్టుకుంటున్నా.. అంతకంటే ఎక్కువగానే అక్రమంగా తరలిపోతోంది. ఎన్నో ఏళ్లుగా ఈ తంతు కొనసాగుతుండగా కొన్ని శాఖల సిబ్బంది అండదండలు వారికి ఉన్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పట్టణంలో ఓ శాఖలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు సిబ్బంది గంజాయి అక్రమ రవాణాకు సహకరిస్తున్నారని తెలిసి ఉన్నతాధికారులు వారిని బదిలీ చేశారు.

తనిఖీలు నామమాత్రమే..

భద్రాచలం బ్రిడ్జి సెంటర్ వద్ద వాహనాలను నామమాత్రంగానే తనిఖీ చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొంతమంది సిబ్బంది తనిఖీల కంటే వసూళ్లకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారనే విమర్శలు సైతం వస్తున్నాయి. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిపోయే వాహనాల పత్రాలు మాత్రమే సిబ్బంది తనిఖీ చేస్తారని, ఫిజికల్ వెరిఫికేషన్ చేపట్టడం అరుదని కొందరు డ్రైవర్లే చెబుతుండడం గమనార్హం.

గత ఐదు నెలలుగా భద్రాచలంలో నమోదైన కేసులు ..

తేదీ	పట్టుకున్న గంజాయి (కేజీల్లో)	విలువ (రూ.లక్షల్లో)
జనవరి 23	58	11.60
ఫిబ్రవరి 14	132	26.40
మార్చి 13	16	3.20
ఏప్రిల్ 7	14	2.80
మే 28	485	97.00
మే 29	500	రూ.కోటి
మే 30	13	2.60
మే 31	13	2.60
జూన్ 6	100	20.0



భద్రాచలం బ్రిడ్జి సెంటర్ వద్ద గల చెక్‌పోస్టు

ఎవరినీ ఉపేక్షించం



గంజాయి అక్రమ రవాణాను అరికట్టేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నాం. రవాణాకు ఎవరు సహకరించినా ఉపేక్షించేది లేదు. ఎంతటి వారైనా చట్టం ముందు ఒక్కటే. భద్రాచలంలో వాహనాల తనిఖీలు విస్తృతం చేస్తాం. చెక్‌పోస్ట్‌ల వద్ద నిఘా పెంచుతాం. భద్రాచలం మీదుగా గంజాయి రవాణాను అడ్డుకునేందుకు స్థానిక పోలీసులు కఠినంగానే వ్యవహరిస్తున్నారు. అనుమానం వచ్చిన ప్రతి ఒక్కరినీ క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు.

– పరితోష్ పంకజ్, ఏఎస్పీ, భద్రాచలం

15న భద్రాచలానికి అమిత్ షా..!

భద్రాచలం: కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఈనెల 15న భద్రాచలం రానున్నట్లు సమాచారం. అదే రోజు మధ్యాహ్నం మూడు గంటలకు ఖమ్మంలో బీజేపీ నిర్వహిస్తున్న భారీ బహిరంగ సభలో ఆయన పాల్గొంటారు. ఈ మేరకు పర్యటన సైతం ఖరారైంది. అయితే బహిరంగ సభకు ముందే ఆయన హెలీకాప్టర్‌లో భద్రాచలం వచ్చి శ్రీ సీతారామచంద్రస్వామి వారిని దర్శించుకుంటారని గురువారం సోషల్ మీడియాలో వార్తలు చక్కర్లు కొట్టాయి. రామాలయానికి అమిత్ షా రాక నిజమేనని జిల్లా బీజేపీ నాయకులు సైతం ధ్రువీకరిస్తున్నారు. కాగా దీనిపై ఉన్నతాధికారులు షెడ్యూల్ విడుదల చేయాల్సి ఉంది. ఇటీవలే రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, రాష్ట్ర గవర్నర్ తమిళి సై రామాలయాన్ని దర్శించుకున్నారు. అమిత్ షా షెడ్యూల్ ఖరారైతే మరోసారి ఆలయంలో వీవీపీల సందడి నెలకొననుంది.

ఐదు పంచాయతీల విలీనంపై మెమోరాండం..

ఏపీలో విలీనమైన ఐదు గ్రామపంచాయతీల ప్రజలు అమిత్ షాను కలిసేందుకు సిద్ధమవుతున్నారు. గుండాల, పిచుకలపాడు, కన్నాయిగూడెం, పురుషోత్తపట్నం, యటపాక గ్రామాలను తిరిగి తెలంగాణలో కలపాలని వారు డిమాండ్ చేస్తున్నారు. దీనిపై ఇప్పటికే పలుమార్లు నిరసన కార్యక్రమాలు చేపట్టడంతో పాటు ఇటీవల భద్రాచలం వచ్చిన గవర్నర్ తమిళి సైకి సైతం వినతిపత్రం అందజేశారు.

నిత్యాన్నదానానికి కూరగాయల వితరణ



దాతలకు అనుమతి పత్రం అందిస్తున్న ఈఓ రమాదేవి

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారి దేవస్థానంలో నిర్వహించే నిత్యాన్నదాన కార్యక్రమానికి ప్రతి రోజూ కూరగాయలు ఉచితంగా అందించేందుకు విజయవాడకు చెందిన భక్తవత్సల సేవా సమితి వారు ముందుకొచ్చారు. ఈ సందర్భంగా కూరగాయలు తీసుకువచ్చే వాహనాన్ని ఆలయ ఈఓ రమాదేవి గురువారం జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం సంస్థ నిర్వాహకురాలు ధనలక్ష్మి మాట్లాడుతూ.. రామయ్య సన్నిధిలో భక్తులకు తాజా కూరగాయలతో అన్నదాన కార్యక్రమం నిర్వహించాలనే సంకల్పంతో ఖర్చుకు వెనకాడకుండా విజయవాడ నుంచి ప్రతిరోజూ కూరగాయలు పంపిస్తామని చెప్పారు. గత పదేళ్లుగా తమ సంస్థ ఆధ్వర్యంలో శ్రీరామనవమికి గోటి తలంబ్రాలను అందజేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

రామాలయంలో ఇద్దరు ఉద్యోగుల సస్పెన్షన్

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో ఇద్దరు ఉద్యోగులను ఆలయ ఈఓ రమాదేవి గురువారం సస్పెండ్ చేశారు. కొద్దిరోజుల క్రితం లడ్డూ తయారీ స్టోర్‌లో రికార్డులను తనిఖీ చేసిన పర్యవేక్షణ కమిటీ.. సుమారు రూ.6 లక్షలకు సంబంధించిన లెక్కల్లో అవకతవకలు ఉన్నట్లు గుర్తించి రిపోర్టును ఈఓకు అందచేశారు. దీంతో బాధ్యులైన ఉన్న జెట్టి రాము, సత్యనారాయణ అనే ఇద్దరు ఉద్యోగులకు ఇటీవల మెమోలు జారీ చేశారు. అయితే వారు ఇచ్చిన వివరణ సరిగా లేకపోవడం, లెక్కల్లో అవకతవకలు జరిగినట్లుగా నిర్ధారణ కావడంతో వారిని సస్పెండ్ చేస్తూ ఈఓ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

ముసలి గొర్రెలు మాకొద్దు..

- నాణ్యత లేనివి అంటగడుతున్నారని లబ్ధిదారుల ఆవేదన
- వారం రోజుల పాటు ఏపీలో భద్రాద్రి వాసుల కష్టాలు
- ఎట్టకేలకు నేడు పంపిణీకి ఏర్పాట్లు



భద్రాచలం నుంచి గొర్రెల కోసం ఏపీకి వెళ్లిన లబ్ధిదారులు

భద్రాచలంటౌన్: తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా అవతరించిన తర్వాత కుల వృత్తులను ప్రోత్సహించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం గొల్ల, కుర్మలకు గొర్రెల పంపిణీ పథకాన్ని ప్రారంభించింది. అయితే మొదటి విడత గొర్రెల పంపిణీలోనే పలు విమర్శలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో రెండో విడత గొర్రెల పంపిణీ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని ఆయా శాఖల అధికారులకు ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. కాగా ఈనెల 5 నుంచే జిల్లాల వారీగా గొర్రెల పంపిణీ ప్రారంభించారు. ఈ క్రమంలో భద్రాచలం మండలంలో లబ్ధిదారులకు మొదటి విడత గొర్రెల యూనిట్లు పంపిణీ చేయగా, మిగిలిన 14 మంది లబ్ధిదారులకు గొర్రెలను చూపించేందుకు అధికారులు ఏపీలోని విశాఖపట్నం జిల్లాకు వారం క్రితం తీసుకెళ్లారు. తమను జిల్లా మొత్తం తిప్పి చివరకు ముసలి గొర్రెలను అంటగడుతున్నారని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా, రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా భద్రాచలం వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో శుక్రవారం గొర్రెల యూనిట్లను పంపిణీ చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. లబ్ధిదారులకు ముసలి గొర్రెల యూనిట్లను పంపిణీ చేస్తూ ఇబ్బంది పెడుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వారం రోజుల పాటు విశాఖపట్నం జిల్లాలోని పలు ప్రాంతాల్లో తిరిగిన లబ్ధిదాలకు గొర్రెలు నచ్చకపోవడంతో అధికారులను వదిలేసి తమ సొంత ఖర్చులతో తిరిగి భద్రాచలం బయలుదేరినట్లు సమాచారం. ఈ మేరకు లబ్ధిదారులు తమ బాధలను వీడియో తీసి కుటుంబ సభ్యులతో పాటు పలు పత్రికలకు వాట్సాప్ ద్వారా పంపించారు. గొర్రెల విక్రయంలో అధికారులు తమ గోడు పట్టించుకోకుండా వారికి నచ్చినట్లు చేస్తున్నారని ఆరోపించారు. వారం రోజుల పాటు ప్రతి రోజు సుమారు 100 కిలోమీటర్లు తిప్పారని, తీవ్ర ఎండలతో అనేక ఇబ్బందులు పడ్డామని పేర్కొన్నారు. ఈ విషయమై ఆయా శాఖల అధికారులను వివరణ కోరేందుకు ప్రయత్నించగా వారు స్పందించలేదు.

'అబ్దుల్ కలాం'లో సినీ టీమ్ సందడి



వివేక్ త్రివేదిని సన్మానిస్తున్న దృశ్యం


సుజాతనగర్: స్థానిక అబ్దుల్ కలాం ఇంజనీరింగ్ కళాశాలలో చక్రవ్యూహం చిత్ర బృందం గురువారం సందడి చేసింది. కళాశాల పూర్వ విద్యార్థి, చిత్ర హీరో వివేక్ త్రివేది మాట్లాడుతూ తాను ఈ కళాశాలలో చదువుకున్నందుకు ఎంతో గర్వపడుతున్నానని, కళాశాల యాజమాన్యం, అధ్యాపకుల ప్రోత్సాహం తన ఎదుగుదలకు దోహదపడిందని అన్నారు. ఈ చిత్రం ఆద్యంతం ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటుందని చెప్పారు. కొత్తగూడెం బిడ్డనైన తన చిత్రాన్ని ప్రతీ ఒక్కరు వీక్షించి విజయానికి కృషి చేయాలని కోరారు. అనంతరం అధ్యాపకులు, విద్యార్థులు త్రివేదిని సత్కరించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ చావా లక్ష్మీనారాయణ, ప్రిన్సిపాల్ వి.సీతారాం ప్రసాద్, ఏఓ శ్రీకాంత్, సాంబశివరావు, బాబురావు, ఉపేందర్, మునీర్, కృష్ణమోహన్, రవికిరణ్, లక్‌పతి పాల్గొన్నారు.

నియోగి బ్రాహ్మణులు ఐకమత్యంగా ఉండాలి

ఖమ్మంగాంధీచౌక్: నియోగి బ్రాహ్మణులు ఐకమత్యంగా ఉంటూ పరస్పరం సహకరించుకోవాలని మాజీ ప్రధాని పీ.వీ.నరసింహారావు కుమారుడు పీ.వీ.ప్రభాకర్‌రావు సూచించారు. ఖమ్మంలోని నియోగి బ్రాహ్మణ సేవాసంఘం కార్యాలయాన్ని గురువారం ఆయన రాష్ట్ర కరణం, నియోగి సంఘం అధ్యక్షుడు బండారు రాంప్రసాద్‌రావుతో కలిసి ప్రారంభించారు. అనంతరం జిల్లా అధ్యక్షులు పలివెల సుబ్బారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రభాకర్‌రావు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ సమాజ శ్రేయస్సు కోరాలన్నారు. ఈ కార్యక్రమంలో తుమ్మలపల్లి ప్రభాకర్‌రావు, మల్లెం రవిప్రసాద్, కొఠారు పాండురంగారావు, వనం కృష్ణవేణి, మంత్రిప్రగడ జగన్‌మోహన్‌రావు, సరస్వతికుమార్, మాటూరు లక్ష్మీనారాయణ, వీ.ఎల్.నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీ జాబితాలో ఇతర కులాలను చేర్చొద్దు

ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్‌నాయక్



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న రాజేష్‌నాయక్ తదితరులు

చండ్రుగొండ : ఎస్టీ జాబితాలో బీసీ కులాల వారిని చేర్చేలా రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి సరికాదని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్‌నాయక్ అన్నారు. మండలంలోని బాల్యాతండాలో గురువారం ఆయన పర్యటించారు. బీసీల్లోని 11 కులాలను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు ప్రభుత్వం ఇటీవల అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ క్రమంలో ఈ నెల 20వ తేదీన 'చలో హైదరాబాద్' కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. వేలాది మంది లంబాడీ గిరిజనులతో ధర్నా చేయనున్నట్లు చెప్పారు. అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిన బీసీ కులాల్లోని 11 తెగలను ఎస్టీ జాబితాలో కలపడం ద్వారా గిరిజనుల మనుగడకు ప్రమాదం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. తండాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. అనంతరం కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎల్‌హెచ్‌పీఎస్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ మోహన్‌నాయక్, జిల్లా అధ్యక్షుడు కేశవ్‌నాయక్, లకావత్ నాగేశ్వరరావు, శంకర్‌నాయక్, కిషన్, శివ, కృష్ణ, మోహన్, చిన్న పాల్గొన్నారు.

కలిసే కానరాని లోకాలకు...

- రోడ్డు ప్రమాదంలో దంపతులు మృతి
- భార్యను ఆస్పత్రికి తీసుకెళ్తుండగా రోడ్డుప్రమాదం

ఇల్లెందురూరల్: ఇళ్లిళ్లు తిరుగుతూ.. సామగ్రి విక్రయిస్తూ రెక్కల కష్టంతో భార్యభర్తలిద్దరూ కుటుంబాన్ని పోషించారు. తాము పడిన కష్టం పిల్లలకు ఎదురుకావొద్దని ముగ్గురు పిల్లలను చదివించగా జీవితాల్లో స్థిరపడ్డారు. ఇక నుంచి తల్లిదండ్రులను పూలల్లో పెట్టుకుని చూసుకోవాలనుకున్న తరుణంలో రోడ్డుప్రమాదం వారిద్దరిని బలి తీసుకుంది. ఈ విషాదకర ఘటన మండలంలోని లలితాపురం గ్రామ సమీపాన గురువారం ఉదయం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని లలితాపురానికి చెందిన నిడికొండ సుబ్బారావు, లలిత దంపతులు(బేడ బుడగజంగాలు) ప్రతిరోజు పల్లెలకు వెళ్లి వివిధ సామగ్రి విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరి ముగ్గురి సంతానాన్ని చదివించగా కుమారుడు రాంబాబు, పెద్దకుమార్తె రాధిక బీటెక్, చిన్నకుమార్తె డిగ్రీ పూర్తిచేసింది. వీరిలో రాంబాబు ఇటీవలే ఉద్యోగంలో చేరగా రాధిక జూనియర్ పంచాయతీ కార్యదర్శిగా ఉద్యోగం చేస్తోంది. ముగ్గురు సంతానంలో ఇద్దరు స్థిరపడడంతో తల్లిదండ్రులు మురిసిపోయారు. ఇక తల్లిదండ్రులను పువ్వుల్లో పెట్టుకుని చూసుకోవాలని పిల్లలు సైతం కలలు కన్నారు. ఈ తరుణాన గురువారం అస్వస్థతకు గురైన లలితను సుబ్బారావు కరెంటాఫీస్ ఏరియాలోని ఆస్పత్రికి బైక్‌పై తీసుకెళ్తుండగా ప్రైవేట్ ఐటీఐ కళాశాల వద్ద ఎదురుగా వచ్చిన కంటెయినర్ లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో సుబ్బారావు అక్కడికక్కడే మృతి చెందగా లలితను ఆస్పత్రికి తీసుకెళ్తుండగా తుదిశ్వాస విడిచింది. తల్లిదండ్రులు ఇద్దరూ మృతి చెందడంతో వారి పిల్లలు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఇక దంపతులు దుర్మరణం చెందడంతో లలితాపురం గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

మందుల దుకాణాల్లో తనిఖీ

కరకగూడెం: మండలంలోని పలు మందుల దుకాణాలను డ్రగ్ ఇన్‌స్పెక్టర్ సంపత్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పలు రికార్డులను పరిశీలించి నిబంధనల ప్రకారం షాపులు నిర్వహించాలని సూచించారు. అంతే కాకుండ అర్హత కలిగిన డాక్టర్ల ప్రిస్కిప్షన్ లేకుండా మందులు విక్రయించొద్దని, క్రమం తప్పకుండా బిల్లులు రాయాలని చెప్పారు.

రేషన్ బియ్యం పట్టివేత

టేకులపల్లి: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని బోడు పోలీసులు గురువారం పట్టుకున్నారు. వివరాలిలా.. కారేపల్లి నుంచి కాకినాడకు వ్యాన్‌లో రేషన్ బియ్యం తరలిస్తున్నారనే సమాచారంతో సీఐ ఇంద్రసేనారెడ్డి, బోడు ఎస్‌ఐ రంజిత్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు పెట్రాంచెలక స్టేజీ వద్ద నిఘా పెట్టి వాహనాన్ని పట్టుకున్నారు. అందులో ఉన్న 45 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా రవాణా చేస్తున్న బాల్జీ, రాము, రాజు, సతీష్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

పాల్వంచరూరల్ : మానసిక స్థితి సక్రమంగా లేని ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన పాల్వంచ మండలం పాండురంగాపురంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన జక్కుల వెంకటేష్(22)కు మానసిక స్థితి సరిగా ఉండక తరుచుగా ఇంట్లో చెప్పకుండానే ఎక్కడెక్కడో తిరిగి కొంత కాలం తర్వాత వస్తుంటాడు. ఈ క్రమంలో బుధవారం బయటకు వెళ్లిన వెంకటేష్ రాత్రి ఇంటికి వచ్చి చీరత్ ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. తల్లిదండ్రులు గురువారం తెల్లవారుజామున లోనికి వెళ్లి చూడగా ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. వెంటనే వారు పాల్వంచ ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడని వైద్యులు నిర్ధారించారు. మృతుడి తండ్రి ముత్తయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.


జమాల్ (ఫైల్)


పాషా (ఫైల్)

తండ్రి చనిపోతాడని.. కొడుకు ఆత్మహత్యాయత్నం

గూడూరు: ఆస్పత్రిలో చికిత్స పొందుతు న్న తండ్రి చనిపోతున్నాడని తెలుసుకు న్న కొడుకు.. ఆవేదనతో పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల కేంద్రంలోని చెంద్రుగూడెంలో గురువారం జరిగింది. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. చెందుగూడానికి చెందిన మహ్మద్ జమాల్ (55)కు ఇద్దరు కుమారులు. పె ద్ద కొడుక్కి పెళ్లి కాగా, చిన్న కొడుకు మ హబూబ్ పాషా ఎమ్మెస్సీ (కెమిస్ట్రీ) చదువుతున్నాడు. నెల రోజులుగా తండ్రి జమాల్ అనారోగ్యంతో బాధపడుతు న్నా డు. అతనికి క్యాన్సర్ అని వైద్యులు చెప్ప డంతో 15 రోజుల క్రితం హైదరాబాద్‌లోని బసవతారకం ఆస్పత్రిలో చేర్పించారు. మూడు రో జుల క్రితం తండ్రి జమాల్ పరిస్థితి విషమించిందని, కొద్దిరోజుల్లో చనిపోతాడని వైద్యులు చెప్పారు. దీంతో మహబూబ్‌పాషా గురువారం స్వగ్రా మానికి చేరుకుని పురుగు మందు తాగి, బంధువులకు ఫోన్ చేసి చెప్పాడు. దీంతో ప్రథమ చికిత్స తర్వాత పాషాను వరంగల్ ఎంజీఎంకు తరలించి చికిత్స అందిస్తున్నారు. మహబూబ్‌పాషా తండ్రి జమాల్ మధ్యాహ్నం 12 గంటలకు ఆస్పత్రిలో చనిపోయాడు. వరంగల్ ఎంజీఎంలో చికిత్స పొందుతున్న మహబూబ్ పాషా పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెప్పినట్లు బంధువులు తెలిపారు.

వేములవాడ రాజన్న హుండీ ఆదాయం రూ.2 కోట్లు

వేములవాడ: రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజన్నకు 15 రోజుల్లోనే రూ.2 కోట్ల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో కృష్ణప్రసాద్ తెలిపారు. గురువారం ఈవో కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో ఆలయ అధికారులు, సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు స్థానిక ఓపెన్‌స్లాబ్‌లో హుండీలలోని నగదు లెక్కించారు. రూ.2 కోట్ల నగదు, 211 గ్రాముల బంగారం, 17,500 కిలోల వెండి సమకూరినట్లు ఈవో వెల్లడించారు. హుండీ లెక్కింపులో ఏఈవోలు ప్రతాప నవీన్, జయకుమారి, శ్రీనివాస్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మొక్కు‘బడి బాట’..!

ప్రభుత్వ స్కూళ్లలో పిల్లల చేరికకు నామమాత్ర స్పందన

- స్థానిక ప్రజా ప్రతినిధులు సహకరించట్లేదంటున్న టీచర్లు
- ఉపాధ్యాయులు నిర్లిప్తంగా వ్యవహరిస్తున్నారని భావిస్తున్న అధికారులు
- కొన్నిచోట్ల బడిబాటకు వెళ్లకుండానే వెళ్లినట్లుగా రికార్డులు!
- బడి మానేసిన వారిని 66 వేల మందిని గుర్తించినా చేరికలపై అస్పష్టత
- ఏజెంట్లను ఏర్పాటు చేసుకుని మరీ ప్రైవేటు స్కూళ్ల జోరు

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థులను చేర్పించేందుకు విద్యాశాఖ చేపట్టిన ‘బడిబాట’కు స్పందన నామమాత్రంగానే ఉంది. స్థానిక ప్రజాప్రతినిధులు ఇందుకు సహకరించట్లేదని ఉపాధ్యాయ వర్గాలు అంటుండగా..టీచర్ల నిర్లిప్తత ఇందుకు కారణమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రైవేటు స్కూళ్లు ఆకర్షించినట్టుగా విద్యార్థులను ప్రభుత్వ టీచర్లు ఆకర్షించడం లేదని ఉన్నతాధికారులు సైతం భావిస్తున్నట్టు సమాచారం. కాగా చాలాచోట్ల బడిబాట కార్యక్రమానికి వెళ్లేందుకు టీచర్లు మొగ్గుచూపడం లేదని తెలుస్తోంది. రికార్డుల్లో వెళ్లినట్టుగా చూపిస్తూ, ఆన్‌లైన్‌లో ఉన్నతాధికారులకు జిల్లా అధికారులు పంపుతున్నారు. దీంతో కార్యక్రమం మొక్కుబడిగా మారింది. డీఈవోలు, ఎంఈవోల కొరతతో పర్యవేక్షణ లోపం కొట్టొచ్చినట్టు కనబడుతోంది.

బడి మానేసినవారు తిరిగి చేరేలా..

బడి మానేసిన వారిని బడికి తిరిగి రప్పించడమే కాకుండా, ప్రభుత్వ స్కూళ్లలోకి విద్యార్థులను మరలించేందుకు విద్యాశాఖ ఈ నెల 3 నుంచి ‘బడిబాట’చేపట్టింది. ప్రతి స్కూల్ పరిధిలో టీచర్లు గ్రామాల్లో ప్రతి ఇంటికీ వెళ్లి, విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి, పిల్లలు బడిలో చేరేలా చూడాలని మార్గదర్శకాల్లో పేర్కొన్నారు.

గుర్తించింది 66 వేలు..

ఏటా ప్రభుత్వ స్కూళ్లలో 2 లక్షల మందిని కొత్తగా చేర్పిస్తున్నామని విద్యాశాఖ చెబుతోంది. కానీ ఇప్పటివరకు బడిలో చేర్పించాల్సిన విద్యార్థులు 66,847 మందిని మాత్రమే గుర్తించినట్టు విద్యాశాఖ వెల్లడించింది. వీరిలో ఒకటవ తరగతిలో చేర్చాల్సిన వారి సంఖ్య 16,038 ఉంది. ఇందులో 12,120 మందిని అంగన్‌వాడీల్లో చేర్పించేందుకు పేర్లు నమోదు చేశారు. ప్రైవేటు స్కూళ్లలో చేరేందుకు 1,181 మంది మొగ్గుచూపారు. ఇక 2,737 మంది బడిబాట బృందాలతో సంబంధం లేకుండానే స్కూళ్లలో చేరేందుకు సిద్ధమయ్యారు. మరోవైపు 2–7 తరగతుల మధ్య బడి మానేసిన పిల్లలు 8,966 మందిని కూడా గుర్తించారు. వీళ్లు ఇప్పటివరకు ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లలో ఎక్కడ చేరారన్నది స్పష్టత ఇవ్వలేదు.



రాజధాని పరిసరాల్లోనే ఎక్కువ

బడి మానేస్తున్న వారిలో గ్రామీణ ప్రాంతాలకన్నా, హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోనే ఎక్కువమంది ఉన్నారు. రంగారెడ్డి జిల్లాలో ఇప్పటివరకు 4,137 మందిని గుర్తించారు. హైదరాబాద్‌లో 2,376 మంది బడి మానేసినట్టు తెలుసుకున్నారు. మెదక్‌లో 2,254 మంది, మేడ్చల్‌లో 1,457 మంది బడికి దూరమైనట్టు గుర్తించారు. ఇక ఖమ్మం జిల్లాలోని మారుమూల ప్రాంతాల్లో 3,371 మంది, నిజామాబాద్‌లో 4,107 మంది బడి మానేసిన పిల్లలున్నారు. హైదరాబాద్, నిజామాబాద్ జిల్లాల్లో స్కూళ్లకెళ్లని విద్యార్థుల తల్లిదండ్రులంతా దినసరి కూలీలే కావడం గమనార్హం. ఇతర ప్రాంతాల నుంచి వలస వచ్చినవారు పిల్లలను కూడా రోజువారీ పనులకు పంపుతున్నట్టు తేలింది. వీళ్లను గుర్తించడమే తప్ప, వీరంతా స్కూళ్లలో చేరతారా? లేదా? అనేది మాత్రం స్పష్టం కావట్లేదు.

ప్రైవేటు టీచర్లకు టార్గెట్లు

ప్రైవేటు స్కూళ్లు విద్యార్థులను, తల్లిదండ్రులను ఆకర్షించడమే లక్ష్యంగా ఏజెంట్లను రంగంలోకి దింపుతున్నాయి. ఇప్పటికే ప్రభుత్వ స్కూళ్లలో చదివే వారికీ గాలమేస్తున్నాయి. గ్రామాల్లో కొంతమందికి కమీషన్లు ఇస్తూ పిల్లల్ని తమ స్కూళ్లలో చేర్పించేలా తల్లిదండ్రులను ఒప్పించాలని కోరుతున్నాయి. ఊరూరా ఫ్లెక్సీలతో ప్రచారం చేస్తున్నాయి. టీచర్లకు టార్గెట్లు విధించి మరీ విద్యార్థులను చేర్చేలా ఒత్తిడి చేస్తున్నాయి. ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాల లెక్కల ప్రకారం ఈ సంవత్సరం ఇప్పటివరకు రాష్ట్రం మొత్తమ్మీద లక్షమంది విద్యార్థులు కొత్తగా ప్రభుత్వ స్కూళ్ల నుంచి ప్రైవేటు స్కూళ్లలో చేరినట్టు తెలుస్తోంది.

అరుణ్ పిళ్లై బెయిల్ పిటిషన్ కొట్టివేత

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో హైదరాబాద్‌కు చెందిన అరుణ్ పిళ్లై బెయిల్ పిటిషన్‌ను రౌజ్ అవెన్యూ కోర్టు కొట్టివేసింది. పిటిషన్‌ను విచారించిన జస్టిస్ నాగ్‌పాల్ ధర్మాసనం ఈ నెల 1న తీర్పును రిజర్వు చేసిన విషయం విదితమే. కాగా జస్టిస్ నాగ్‌పాల్ గురువారం తీర్పును వెలువరించారు. తెలంగాణ ఎమ్మెల్సీ కవిత పేరును తీర్పును ప్రస్తావించడం గమనార్హం. ‘ఈ కేసులో పిళ్లై ప్రధాన నిందితుడిగా ఈడీ ఆరోపిస్తోంది. సౌత్ గ్రూపు తరఫున పలు సమావేశాల్లో పాల్గొన్నారని పేర్కొంది. అడ్వాన్స్ కిక్‌బ్యాక్‌ల చెల్లింపుల్లో సౌత్ గ్రూపు సభ్యుడిగా ప్రమేయం ఉందని, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రతినిధిగా, ఇండో స్పిరిట్స్‌లో డమ్మీ పార్టనర్‌గా ఉన్నారన్న ఆరోపణలు ఉన్నాయి. కుట్రలో పిళ్లై భాగస్వామ్యంపై మౌఖిక, డాక్యుమెంటరీ ఆధారం ఉందని ఈడీ పేర్కొంది. ఇండోస్పిరిట్స్ రూ.192 కోట్ల లాభాల్లో పిళ్లై రూ.32.86 కోట్లు ఆర్జించారని, పెట్టుబడి ఎమ్మెల్సీ కవిత పెట్టారని, కవిత ప్రతినిధిగా ప్రాపర్టీలు కొనుగోలు చేయడంలో కూడా పిళ్లై ప్రమేయం ఉందని ఈడీ తరఫు న్యాయవాది పేర్కొన్నారు. పిళ్లై 29 సార్లు దర్యాప్తునకు సహకరించారని పిటిషనర్ తరఫు న్యాయవాది తెలిపారు. అన్యాయంగా పిటిషనర్‌ను అరెస్టు చేశారని ఆరోపించారు. కానీ ఈడీ అధికారులు హైదరాబాద్‌లో పిళ్లై నివాసంపై దాడులు చేసినప్పుడు అతని భార్య, మరికొందరు ఈడీ అధికారులను నియంత్రించారన్న ఆరోపణలున్నాయి. ఇతర నిందితులు సమీర్ మహేంద్రు, విజయ్‌నాయర్, అభిషేక్ బోయినపల్లి, బినోయ్‌బాబు, శరత్ చంద్రారెడ్డి, రాఘవ మాగుంట, మనీష్ సిసోడియా తదితరుల రెగ్యులర్ బెయిల్ పిటిషన్లు కొట్టివేశాం. మరోవైపు మనీలాండరింగ్ నేరంలో ఇతర నిందితుల కన్నా పిటిషనర్ పాత్ర చాలా తీవ్రమైనదిగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో అతని బెయిల్ పిటిషన్‌ను కొట్టివేస్తున్నాం..’అని జస్టిస్ నాగ్‌పాల్ తీర్పులో స్పష్టం చేశారు.

వర్క్ వీసా పేరుతో మోసం

- మలేషియాలో చిక్కుకున్న 19మంది తెలంగాణ, ఏపీ వాసులు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధిత కుటుంబ సభ్యులు


మలేషియాలో చిక్కుకున్న బాధితులు (ఫైల్)

ఎర్రుపాలెం: విదేశాల్లో మంచి ఉపాధి కల్పిస్తామని, మెరుగైన వేతనం లభిస్తుందని బ్రోకర్లు చెప్పిన మాయమాటలు నమ్మి తెలంగాణ, ఏపీలకు చెందిన పలువురు మోసపోయారు. మోసానికి గురైన బాధితులు మలేషియాలో చిక్కుకుని అవస్థలు పడుతున్నారు. దీనిపై బాధిత వ్యక్తుల కుటుంబసభ్యులు గురువారం సాయంత్రం పోలీసులను ఆశ్రయించారు. వివరాలిలా ఉన్నాయి.. ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం రాజుపాలెం, నారాయణపురం, జమలాపురం, అయ్యవారిగూడెం గ్రామాలతో పాటుగా ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడి పట్టణానికి చెందిన 12 మంది మహిళలు, ఏడుగురు పురుషులు బ్రోకర్ల వలలో చిక్కుకున్నారు. ఎన్టీఆర్ జిల్లా నూజీవీడు మండలం పోతిరెడ్డిపల్లికి చెందిన మండపాటి నాగబాబు, హైదరాబాద్‌కు చెందిన పాదిల దాశరథి నాయుడు టూరిస్టు వీసాపై మలేషియాకు పంపించి అక్కడ వర్క్ వీసా వచ్చేలా చూస్తామని, మూడేళ్ల పాటు మెరుగైన వేతనం అందుతుందని నమ్మబలికారు. దీంతో మొత్తం 19 మంది రూ.1.90 లక్షల నుంచి 2.75 లక్షల వరకు నాగబాబుకు చెల్లించారు.

గత ఏడాది డిసెంబర్ 17నుంచి వీరిని విడతల వారీగా మలేషియా పంపించి హోటళ్లు, సంస్థల్లో క్లీనింగ్ పని ఇప్పించారు. కానీ కొన్నాళ్ల తర్వాత వీరి వద్ద వర్క్ వీసా లేకపోవడంతో యజమానులు పనిలో నుంచి తొలగించారు. కాగా, అక్కడి అధికారులు వర్క్‌వీసా లేని వీరికి భారత కరెన్సీ ప్రకారం దాదాపు రూ.40 వేల చొప్పున జరిమానా విధించారు. దీంతో బాధితులు తమకు జరిగిన మోసం గురించి కుటుంబీకులకు చెప్పగా ఇక్కడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితులకు జరిగిన మోసంపై కేసు నమోదు చేసినట్లు ఎర్రుపాలెం ఎస్సై ఎం.సురేశ్ వెల్లడించారు.

భారీగా నకిలీ విత్తనాల పట్టివేత

వరంగల్‌లో రూ.2.11 కోట్ల విలువైన విత్తనాలు స్వాధీనం


పట్టుబడిన నకిలీ విత్తనాలు, ముఠా సభ్యులతో పోలీసులు

వరంగల్ క్రైం: వరంగల్ కేంద్రంగా నకిలీ విత్తనాల తయారీ, విక్రయాలకు పాల్పడుతున్న రెండు ముఠా సభ్యులను పోలీసులు అరెస్ట్ చేశారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు చెందిన టాస్క్ ఫోర్స్, మడికొండ, ఏనుమాముల పోలీసులు, వ్యవసాయ అధికారులు సంయుక్తంగా నిందితులను పట్టుకున్నారు. వారి నుంచి రూ.2.11 కోట్ల విలువైన 12 టన్నుల నకిలీ పత్తి విత్తనాలు, ఒక డీసీఎం వ్యాన్, ఒక కారు, రూ.21 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ గురువారం మీడియాకు తెలిపారు. ఏపీలోని కర్నూల్ జిల్లాకు చెందిన దాసరి శ్రీనివాస్, తాప్తే హన్మంతులు, హైదరాబాద్‌కు చెందిన చేడాం పాండ్, చేడాం వెంకటరమణ, వేముల అరవింద్ రెడ్డి, మంచిర్యాలకు చెందిన కొప్పుల రాజేష్, బోగే సత్యం, షేక్ అన్వద్, వెంకటేష్, పుట్ట రాజేశం, చంద్రపూర్‌కు చెందిన సురేందర్‌రెడ్డి, బల్లార్షకు చెందిన ఏన్గుడే దిలీప్, మహబూబ్‌నగర్‌కు చెందిన చేడాం నాగరాజు, బాపట్లకు చెందిన సుందర్ శెట్టి ఫణిందర్, నాగర్‌కర్నూల్‌కు చెందిన కాల్వ శ్రీధర్ అరెస్టు చేసినట్లు తెలిపారు. శివారెడ్డి, భాస్కర్‌రెడ్డి, గంప సదాశివ్‌లు పరారీలో ఉన్నారన్నారు. ముఠా సభ్యులు రైతుల నుంచి తక్కువ ధరకు విడిగా విత్తనాలు కొనుగోలు చేసి వాటికి రంగులు అద్ది, ఎలాంటి జెనటిక్ ఫార్మింగ్ చేయకుండా పలు కంపెనీల పేరుతో ప్యాకెట్లు రూపొందించి క్యూఆర్ కోడ్ ముద్రించి బహిరంగ మార్కెట్‌లో విక్రయిస్తున్నట్లు సీపీ తెలిపారు. గుజరాత్ చెందిన నర్మద సాగర్ కోమార్కెటింగ్, రిషి, శ్రీగణేష్ కంపెనీల పేరుతో నకిలీ విత్తనాలు తయారు చేసినట్లు చెప్పారు. సమావేశంలో ఈస్ట్‌జోన్ డీసీపీ కరుణాకర్, ఏసీపీలు జితేందర్‌రెడ్డి, కృపాకర్, తిరుమల్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వార్తలు

యూపీఎస్సీ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

భద్రాచలం: యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) నిర్వహించే సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్, మెయిన్స్, ఇంటర్వ్యూలకు సిద్ధమవుతున్న ఎస్టీ, ఎస్సీ, బీసీ అభ్యర్థులకు శిక్షణ ఇవ్వనున్నట్లు భద్రాచలం ఐటీడీఏ పీఓ గౌతమ్ పోట్రు తెలిపారు. హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని గిరిజన ఐఏఎస్ స్టడీ సర్కిల్‌లో రెసిడెన్షియల్ విధానంలో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యాన శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. ఆబ్జెక్టివ్ టైప్, ఆప్టిట్యూడ్ పరీక్ష ద్వారా అభ్యర్థులను ఎంపిక చేయనుండగా కుటుంబ వార్షికాదాయం రూ.3లక్షలు దాటని వారు అర్హులని తెలిపారు. ఆసక్తి, అర్హతలు ఉన్న వారు స్టడీ సర్కిల్ వైబ్‌సైట్ ద్వారా వచ్చేనెల 8వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని పీఓ సూచించారు.

ఆటో బోల్తా : ఒకరు మృతి

కామేపల్లి(కారేపల్లి): అదుపు తప్పి ఆటో బోల్తా పడిన ఘటనలో ఒకరు మృతి చెందగా, ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ నుంచి ఖమ్మం జిల్లా కామేపల్లి మండలం కొత్తలింగాల వైపు వస్తున్న ఆటో కామేపల్లి మండలం బండిపాడు స్టేజీ వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న కారేపల్లి మండలం కొత్తూరు తండాకు చెందిన బానోతు ప్రశాంత్ (17) అక్కడికక్కడే మృతి చెందగా, డోర్నకల్‌కు చెందిన బానోతు సునీత, ధరావత్ అచ్చమ్మ, గార్లకు చెందిన జర్పుల చౌరికి తీవ్రగాయాలయ్యాయి. వీరిని 108లో ఖమ్మం ఆస్పత్రికి తరలించినట్లు కామేపల్లి ఎస్‌ఐ కిరణ్‌కుమార్ తెలిపారు.

విద్యార్థుల సంఖ్య పెంపే లక్ష్యం


పాఠశాలలకు పుస్తకాలు అందజేస్తున్న రవికుమార్

కల్లూరు రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంపే లక్ష్యంగా బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఖమ్మం జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి కేశవపట్నం రవికుమార్ తెలిపారు. కల్లూరు మండలం నారాయణపురం, లోకవరం పాఠశాలల ఉపాధ్యాయులు గురువారం చేపట్టిన బడిబాట కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాలల్లోని సౌకర్యాలను తల్లిదండ్రులకు వివరించి చేర్పించాలని సూచించారు. ఎఫ్ఎల్ఎన్ అధికారి మాధవరావు, ఎంఈఓ దామోదర్‌ప్రసాద్ ఎఆర్‌పీలు వేలాద్రి, ఆరీఫ్, రవీంద్ర, రాము, శ్రీనివాస్, కృష్ణయ్య, లక్ష్మి, తాయారు, సాబీ పాల్గొన్నారు.

ఆర్టీసీలో విలేజ్ బస్ ఆఫీసర్లు!

- ఖమ్మం రీజియన్‌లో 134 మంది నియామకం
- నేటి నుంచి విధులు నిర్వర్తించనున్న ఉద్యోగులు
- ప్రజలకు చేరువయ్యేందుకు ఆర్టీసీలో కొత్త వ్యవస్థ



కొత్తగూడెం ఆర్టీసీ డిపో

చుంచుపల్లి: ఆర్టీసీ సంస్థ ఆర్థిక పరిపుష్టి సాధించడంతో ప్రయాణికులక మెరుగైన సేవలందించేలా ఎప్పటికప్పుడుకొత్త మార్గాలను అన్వేషిస్తోంది. ఇందులో భాగంగా డిపోల పరిధిలో కొత్తగా విలేజ్ బస్ ఆఫీసర్లను నియమించింది. ప్రస్తుతం సంస్థలో పనిచేస్తున్న డ్రైవర్లు, కండక్టర్లు, ఇతర సిబ్బంది పలువురికి ఈ అదనపు బాధ్యతలు అప్పగించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఆరు డిపోల పరిధిలో మొదటి విడతగా 134 మందిని ఎంపిక చేయగా వీరు తమకు కేటాయించిన గ్రామాల్లో ఆర్టీసీ సేవలను వివరిస్తూ, ప్రయాణికులు సంస్థను ఆదరించేలా కృషి చేస్తారు. ఖమ్మం రీజియన్‌లోని ఖమ్మం డిపో పరిధిలో 35 మంది, సత్తుపల్లి డిపోలో 25మంది, భద్రాచలంలో 24 మంది, కొత్తగూడెంలో 22 మంది, మధిరలో 20 మందితో పాటు మణుగూరు ఎనిమిది మందిని నియమించారు. ఇప్పటికే నిర్వర్తించాల్సిన బాధ్యతలపై శిక్షణ ఇవ్వగా, టీషర్టులు, బ్యాగులు, గుర్తింపు కార్డులు అందజేశారు.


గ్రామాల వారీగా బాధ్యతలు

పెద్ద గ్రామానికైతే ఒకరు చొప్పున. చిన్న గ్రామాలైతే రెండు, మూడింటికి ఒక విలేజ్ బస్ ఆఫీసర్‌కు బాధ్యతలు అప్పగించారు. వీరు ప్రజలతో సమావేశమై బస్సుల రాకపోకల సమయం, నూతన సర్వీస్లు, సమస్యల వివరాలు తెలుసుకుని అధికారులకు చెప్పాల్సి ఉంటుంది. అలాగే, గ్రామాల్లో పెళ్లిళ్లు, శుభకార్యాలు, జాతరల వివరాలను సేకరించి రద్దీకి అనుగుణంగా బస్ ట్రిప్పులు పెంచేలా చూస్తారు. శుభకార్యాలు జరిగే వారి ఇళ్లకు వెళ్లి ఆర్టీసీ బస్సు అద్దెకు తీసుకుంటే అందే రాయితీలను వివరిస్తారు. ఈక్రమంలో ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, సంఘాల నాయకులు, ఫంక్షన్ హాళ్ల నిర్వాహకులను సంప్రదిస్తారు. గతంలో బస్సులను సంబంధించి సమస్యలు ఉన్నా, కొత్త సర్వీస్ కావాలన్నీ, అద్దెకు బస్సు తీసుకోవాలన్నా గ్రామాల ప్రజలు డిపోమేనేజర్లను సంప్రదించాల్సి వచ్చేది. ఒక్కోసారి డిపోకు వెళ్లలేక, ఫోన్ నంబర్లు అందుబాటులో లేక ప్రజలు ప్రైవేట్ సర్వీసులను ఆశ్రయించే వారు. కానీ విలేజ్ బస్ ఆఫీసర్లతో ఈ సమస్యలన్నీ తీరి ప్రజలకు ఆర్టీసీ మరింత చేరువవుతుందని భావిస్తున్నారు.

ఏం చేస్తారు..

విలేజ్ ఆఫీసర్లు శుక్రవారం నుంచి తమ విధులు నిర్వర్తించనున్నారు. ఆర్టీసీ ద్వారా అందించే సేవలను గ్రామాల్లో ప్రజలకు వివరించడమే కాక సురక్షిత ప్రయాణానికి ఆర్టీసీని ఆదరించాలని అవగాహన కల్పిస్తారు. దివ్యాంగులు, వృద్ధులు, విద్యార్థులకు అందించే రాయితీ పథకాలు, బస్ పాస్‌ల వివరాలు వెల్లడిస్తారు. అంతే కాక గ్రామస్తుల నుంచి అందే వినతులు, ఫిర్యాదులు, సర్వీస్ అవసరమైన రూట్లను గుర్తించి ఆర్టీసీ అధికారులకు సమాచారం ఇవ్వనున్నారు.

ఆర్టీసీ సేవలు విస్తృతం చేసేలా...



ఆర్టీసీలో కొత్తగా విలేజ్ బస్ ఆఫీసర్ల వ్యవస్థ అమల్లోకి వస్తోంది. ఇప్పటికే శిక్షణ పూర్తి చేసుకున్న వారు గ్రామాల్లో అందుబాటులో ఉంటూ ప్రజలకు ఆర్టీసీ సేవలను వివరిస్తారు. దీంతో పాటు ఆర్టీసీని ప్రజలకు చేరువ చేసేలా కృషి చేయనున్నారు.

– బి.వెంకటేశ్వరరావు, డీఎం, కొత్తగూడెం

మహిళా హక్కుల రక్షణకు ఉద్యమించాలి..

ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి


సమావేశంలో మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర కార్యదర్శి లక్ష్మి

ఖమ్మంమయూరిసెంటర్: మహిళల హక్కుల రక్షణ, సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి పిలుపునిచ్చారు. ఐద్వా(అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం) ఉమ్మడి ఖమ్మం, నల్లగొండ, వరంగల్ జిల్లాల స్థాయి తరగతులు గురువారం ఖమ్మం సుందరయ్య భవన్‌లో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మాచర్ల భారతి అధ్యక్షతన జరిగిన సభలో లక్ష్మి మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చాక మహిళలపై లైంగిక వేధింపులు పెరిగాయన్నారు. 2014 ముందు నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ధరలు పెంచుతోందని గగ్గోలు పెట్టిన బీజేపీ నేతలు.. ఇప్పుడు అన్ని వస్తువుల ధరలు పెంచారని ఆరోపించారు. ఇక ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానన్న హామీని విస్మరించి ప్రభుత్వ రంగాన్ని కార్పొరేట్లకు అప్పగించారని తెలిపారు. అలాగే, నల్లధనాన్ని తీసుకొచ్చి పేదలకు ఇవ్వడం, పేదలందరికీ ఇళ్ల నిర్మాణం హామీలేమీ నెరవేరలేదని చెప్పారు. ఒలింపిక్స్‌లో పతకాలు సాధించిన మహిళలకే రక్షణ కల్పించలేని బీజేపీ నేతలు సాధారణ మహిళలకు ఏ రకంగా రక్షణ కల్పిస్తారో చెప్పాలని ప్రశ్నించారు. పార్లమెంట్ భవనాన్ని రాష్ట్రపతితో ప్రారంభించకుండా మహిళలను అణగదొక్కారని లక్ష్మి విమర్శించారు. ఇటీవల త్రిపురలో నెల రోజుల్లోనే 15 మంది మహిళలపై బీజేపీ నేతలు అత్యాచారం చేశారని మండిపడ్డారు. ఆతర్వాత బుగ్గవీటి సరళ, బత్తుల హైమావతి మాట్లాడగా, ఖమ్మం జిల్లా అధ్యక్షురాలు బండి పద్మ, సభ్యులు అఫ్రోజ్ సమీనా, ప్రభావతి, ఎం.రమణ, పయ్యావుల ప్రభావతి, నాగసులోచన, మొహరున్నీసా బేగం, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యత లోపిస్తే టెండర్లు రద్దు


అధికారుల సమక్షంలో టెండర్లు ఖరారు చేస్తున్న డేవిడ్‌రాజ్

భద్రాచలం: గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలు, గిరిజన గురుకుల విద్యాలయాల్లో విద్యార్థులకు నిబంధనల ప్రకారం నాణ్యమైన వస్తువులు, ఆహార పదార్థాలు సరఫరా చేయాలని ఐటీడీఏ ఏపీఓ జనరల్, ఇన్‌చార్జ్ డీడీ, ఇన్‌చార్జ్ ఆర్‌సీఓ డేవిడ్‌రాజ్ సూచించారు. భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో గురువారం 2023–24కు గాను విద్యాలయాలకు వివిధ రకాల వస్తువులు, ఆహార పదార్థాల సరఫరాకు టెండర్లు ఖరారు చేశారు. ఈ సందర్భంగా తక్కువగా కోట్ చేసిన ఏజెన్సీదారులకు కాంట్రాక్ట్ అప్పగించాక డేవిడ్‌రాజ్ మాట్లాడారు. నిబంధనల మేరకు నాణ్యమైన వస్తువులు, ఆహార పదార్థాలను సరఫరా చేయకున్నా, ఫిర్యాదులు వచ్చినా టెండర్ దారులను తొలగిస్తామని స్పష్టం చేశారు. ఏసీఎంఓ రమణయ్య, ఏటీడీఓలు నర్సింహారావు, చంద్రమోహన్, జీసీసీ మేనేజర్లు వీరభద్రస్వామి, కృష్ణసాగర్‌తో పాటు హరిసింగ్, దేవదాస్, పద్మావతికుమారి, కృష్ణార్జున పాల్గొన్నారు.

‘ప్రజాగర్జన’ సభను జయప్రదం చేయండి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు


సమావేశంలో మాట్లాడుతున్న సాంబశివరావు

సింగరేణి(కొత్తగూడెం): దేశంలోని, రాష్ట్రంలోని ప్రజా సమస్యల పరిష్కారం, సింగరేణి తదితర ప్రభుత్వ రంగ సంస్థలు, రాజ్యాంగ, లౌకిక వ్యవస్థల పరిరక్షణే ధ్యేయంగా ఈనెల 11న కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో ప్రజాగర్జన సభ నిర్వహిస్తున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తెలిపారు. ఈమేరకు పార్టీ శ్రేణులతో పాటు అన్ని వర్గాల ప్రజలు తరలివచ్చి సభను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కొత్తగూడెంలో గురువారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సభకు సీపీఐ జాతీయ నేతలు డి.రాజా, కె.నారాయణతో పాటు సయ్యద్ అజీజ్‌పాషా, పువ్వాడ నాగేశ్వరరావు, చాడ వెంకటరెడ్డి తదితరులు హాజరవుతారని తెలిపారు. సింగరేణి ప్రైవేటీకరణ, కాంట్రాక్టీకరణకు వ్యతిరేకంగానే కాక విభజన హామీలైన బయ్యారం ఉక్కు కర్మాగారం, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తో ఉద్యమాలు చేపట్టనున్నట్లు చెప్పారు. సుమారు ముప్పై ఏళ్ల క్రితం నిర్వహించినట్లుగా ఇప్పుడు నిర్వహిస్తున్న సభకు ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చేందుకు సిద్ధమవుతున్నారని కూనంనేని తెలిపారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కే.సాబీర్‌పాషా, నాయకులు బందెల నర్సయ్య, గుత్తుల సత్యనారాయణ, చంద్రగిరి శ్రీనివాస్, వాసిరెడ్డి మురళి, సలిగంటి శ్రీనివాస్, కంచర్ల జమలయ్య, వై.శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని బాలికను రక్షించిన చైల్డ్‌లైన్

24గంటల్లో చిరునామా గుర్తింపు, తల్లికి అప్పగింత


బాలికను తల్లికి అప్పగిస్తున్న అధికారులు

ఖమ్మంగాంధీచౌక్: మతిస్థిమితం లేని పదేళ్ల బాలిక ఖమ్మంలో తిరుగుతుండగా చైల్డ్‌లైన్ 1098 బృందం గుర్తించి వివిధ ఆధారాల ద్వారా తల్లిని పిలిపించి అప్పగించారు. చైల్డ్‌లైన్–1098 కోఆర్డినేటర్ కె.శ్రీనివాస్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మతిస్థిమితం లేని మూగ బాలిక ఖమ్మంలో ఒంటరిగా తిరుగుతుండగా బుధవారం రాత్రి గుర్తించిన అంగన్‌వాడీ టీచర్ 1098కు సమాచారం ఇచ్చింది. అంతేకాక పాపను త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌కు తీసుకుకెళ్లగా చైల్డ్‌లైన్ కో–ఆర్డినేటర్ శ్రీనివాస్ చేరుకుని బాలలసదనంలో రక్షణ కల్పించారు. అనంతరం ఆమె వద్ద పరిశీలించగా ఇల్లెందు నుంచి ఖమ్మం వచ్చినట్లు పల్లెవెలుగు టికెట్ లభించింది. దీంతో యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్‌కు సమాచారం ఇవ్వగా వారు దర్పణ్ యాప్‌లో పరిశీలించగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం పాతతండాకు చెందిన బాలికగా గుర్తించారు. ఈ ఆధారంగా బాలిక తల్లి, మేనమామ, అక్కడి అంగన్‌వాడీ టీచర్‌కు పిలిపించి సీడబ్ల్యూసీ సమక్షాన అప్పగించారు. బాలిక చిరునామాను కనుగొన్న చైల్డ్‌లైన్ కె.శ్రీనివాస్‌ను, హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ సభ్యులు నర్సింహారావు, భాస్కర్‌ను సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ భరత రాణి అభినందించారు. అలాగే, బాలిక కుటుంబీకులకు కౌన్సెలింగ్ ఇస్తూ ఒంటరిగా వదిలేయకుండా జాగ్రత్తగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీడబ్ల్యూసీ సభ్యులు లింగయ్య పాల్గొన్నారు.